క్లుప్తంగా

బస్టాండ్‌లో వసతులు కల్పించాలి

కోసిగి : స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి కనీస వసతులు కల్పించాలని ఆదోని ఆర్టీసీ డీఎం రఫీక్‌ను స్థానికులు కోరారు. బుధవారం కోసిగి ఆర్టీసి బస్టాండ్‌ను డీఎం తనిఖీ చేశారు. ఈ మేరకు స్థానిక ప్రజలు ఆయనను కలసి సమస్యలను ప్రస్తావించారు. బస్టాండ్ ప్రాంగణంలో ఇష్టానుసారంగా ప్రైవేటు వాహనాలు నిలుపుతున్నారని, దీంతో ప్రయాణిలు బస్సులు ఎక్కడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

పలువురు వలంటీర్ల రాజీనామా

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో పని చేస్తున్న నలుగురు వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. వార్డు సచివాలయాల అడ్మిన్‌లకు తమ రాజీనామా పత్రాలను అందజేశారు. వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేశామని పేర్కొన్నారు. 39వ వార్డు ప్రణయ్‌కుమార్, 11వ వార్డులో ఉమేష్, 20వ వార్డులో ఉషారాణి, బసవశేఖర్ ఉన్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డికి సిఫారసు చేసినట్లు వార్డు సచివాలయాల అడ్మిన్‌లు తెలిపారు.

ఆదోని రూరల్: మండలంలోని ఆరేకల్ గ్రామానికి చెందిన వలంటీర్ జల్లి నాగన్న రాజీనామా చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ విజయశేఖరరావు, పంచాయతీ కార్యదర్శి బాబుకు తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. వలంటీర్ వ్యవస్థపై చేస్తున్న దుష్ప్రచారానికి మనస్తాపం చెంది రాజీనామా చేసినట్లు తెలిపారు.

ఆదోని రూరల్: మండలంలోని గణేకల్ వలంటీర్ సంజీవయ్య బుధవారం రాజీనామా చేశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, బీజేపీ నాయకులు వలంటీర్లపై చేస్తున్న అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో మనస్తాపానికి గురయ్యామని తెలిపారు. ఈ మేరకు ఆదోని ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయశేఖర్‌రావుకు తన రాజీనామా పత్రాన్ని అందజేశారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం


ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

కోసిగి: మండలంలోని సాతనూరు గ్రామానికి చెందిన బీరప్ప, వెంకోబ, మహ్మద్‌పూజారి లింగన్న, అగసనూరు లింగన్న అనే రైతుల సంబధించిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. పొలాల్లో రాత్రిల్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ స్తంభాలకు ఉన్న విద్యుత్ తీగలను తొలగించి 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను బద్దలు కొట్టి ధ్వంసం చేసి వాటిలోనున్న కాపర్ తీగను దొంగలించారు. దాదాపు రూ.2లక్షలు ఆస్తి నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు.ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఆదోని యార్డుకు భారీగా మిర్చి


అమ్మకానికి వచ్చిన ఎండుమిర్చి

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఎండుమిర్చి యార్డుకు బుధవారం భారీగా ఎండుమిర్చి బస్తాలు వచ్చాయి. రైతులు 7301 బస్తాల ఎండుమిర్చిని విక్రయానికి తీసుకొచ్చారు. గరిష్టంగా రూ.12101, మధ్య రూ.8001, కనిష్టం రూ. 3100గా నమోదయ్యింది. ఇందులో బ్యాడిగ రకం గరిష్టంగా రూ.12101, డీలక్స్ రూ.5339, లాలీ రకం రూ.7502, తేజ రకం రూ.8508, సింజెంటా రూ.5560, 2043 రకం రూ.6901, త్రివేణి రూ.9 వేలు, సూపర్-10 రకం రూ.6789, 5531 రకం రూ.7002 నమోదయ్యాయి. యార్డులో బుధవారం, శనివారం మిర్చి క్రయ విక్రయాలను అధికారులు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

తప్పుడు ప్రచారాలపై ఫిర్యాదు

ఆదోని అర్బన్: సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు, ఆరోపణలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు బుధవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జలీమ్‌షఫీ, నియాజ్‌అహ్మద్, అహ్మద్‌బాషా, ముల్లా రఫిక్, నూర్‌బాషా, బత్తి అమాన్, మాలిక్, ఏజాజ్, పార్టీ పట్టణాధ్యక్షుడు దేవా, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ తిమ్మప్ప మాట్లాడారు. అసత్య పోస్టులు పెట్టి ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై టూటౌన్ సీఐ గోపీ మాట్లాడుతూ విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

ఆదోని రూరల్: ఆదోని మండలంలోని చాగి గ్రామానికి చెందిన మాల లక్ష్మీ రెండు రోజుల క్రితం చిప్పగిరిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న, మండల కార్యదర్శి డి.రామాంజనేయులు, కేవీపీఎస్ మండల కార్యదర్శి బి.తిక్కప్ప కోరారు. బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

పింఛన్ కష్టాలు

- ఉదయం నుంచే సచివాలయాల వద్దకు చేరిన లబ్ధిదారులు
- సాయంకాలం వరకు పడిగాపులు
- తిండి మానుకుని అవస్థలు
- చంద్రబాబు అక్కసుతో ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన


కౌతాళంలో పింఛన్ల కోసం వేచి ఉన్న వృద్ధులు, వితంతువులు

కోసిగి: పింఛన్ కోసం అవ్వ తాతలు, వితంతవులు, దివ్యాంగులకు కష్టాలు మొదలయ్యాయి. ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ చేసే ప్రక్రియకు వలంటీర్లను దూరం చేయడంతో వారికి అవస్థలు తప్పడం లేదు. ఈ నెలకు సంబంధించిన పింఛన్ ఈనెల 3వ తేదీ నుంచి పంపిణీ చేస్తారని సచివాలయాల వద్దకు రావాలని అధికారులు సూచించారు. దీంతో ఉదయం నుంచే కార్యాలయాలకు చేరుకొని అధికారుల కోసం నిరీక్షించారు. మధ్యాహ్నం రెండు దాటినా పంపిణీ చేయకపోవడంతో ఎండకు తాళలేక, తిండి లేక అవస్థలు పడ్డారు. మధ్యాహ్నం నుంచి ఇస్తామని చెప్పడంతో ఇళ్లకు వెళ్లి తిరిగి రాలేక ఇక్కడే ఉండిపోయామని వృద్ధులు, దివ్యాంగులు తెలిపారు. కొందరు తాము ఏ సచివాలయ పరిధిలో వస్తామో తెలియక అగచాట్లు పడ్డారు.

వలంటీర్లను దూరం చేసి..

58 నెలల పాటు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి.. ఇళ్ల వద్దకే వలంటీర్ల ద్వారా తెల్లవారుజాము నుంచే పింఛన్లు పంపిణీ చేయించారు. ఎన్నికల నేపథ్యంలో చంద్రబాబు నాయుడు తన మనుషుల ద్వారా ఫిర్యాదుల చేయించి వారిని పింఛన్ల పంపిణీకి దూరం చేయించారు. దీంతో పింఛన్ దారులకు ఆపసోపాలు ప్రారంభమయ్యాయి. చంద్రబాబుకు తమ మీద ఎందుకంత అక్కసు అని మండిపడుతున్నారు.

నియోజకవర్గంలో పింఛన్లు..

మంత్రాలయం నియోజకవర్గంలో ఏప్రిల్ నెలకు సంబధించి పింఛన్లు కోసిగి మండలంలో 7,461 మందికి గానూ రూ.22,34,7000, కౌతాళం మండలంలో 8,760 మందికి గానూ రూ.26,16,9000, మంత్రాలయం మండలంలో 7,088 మందికి రూ.21,07,0500, పెద్దకడబూరు మండలంలో 6,602 మందికి రూ. 19,74,9000 మంజూరైంది.


కోసిగి సచివాలయం-3 వద్ద మధ్యాహ్నం వేళ వేచి ఉన్న పింఛన్‌దారులు

ఇంత దూరం నడవలేకపోయాను



వలంటీర్‌ను తొలగించారని చెప్పారు. చాలా బాధపడ్డాను. ఇంటి వద్దకు వచ్చి తెల్లవారుజామునే పింఛన్ ఇచ్చేవాడు. మాలాంటి ముసలి వాళ్లకు ఎంతో మేలు కలిగేది. నడవలేక అవస్థలు పడుతూ కిలో మీటర్ దూరం నుంచి వచ్చాను. పింఛన్ లేక పోతే నాటీ ఖర్చులకు కూడా ఇచ్చే వారు లేరు. జగనన్న ప్రభుత్వమే రావాలి. ఆయన వస్తే మాకు ఇలాంటి కష్టాలు రానివ్వడు.

– కురువ మంగమ్మ, కోసిగి


తోవి గ్రామంలో వేచి ఉన్న పించన్‌ధారులు

కౌతాళం: ఎన్నికల సాకు చూపుతూ వలంటీర్లను పథకాల అమలుకు దూరం చేయాలని ప్రతిపక్షాల కుట్రతో పింఛన్‌దారులకు ఇక్కట్లు మొదలయ్యాయి. బుధవారం పింఛన్ల కోసం చాలా చోట్ల ఉదయం నుంచి సచివాలయాల వద్ద వేచి ఉన్న దృశ్యాలు కనిపించాయి. మధ్యాహ్నం గడిచినా పింఛన్ ఇవ్వకపోవడంతో ఎండకు తాళ లేక ఎక్కడ నీడ ఉంటే అక్కడకు వెళ్లడం చూసిన వారిని బాధించింది. మండలంలో మొత్తం 8,760మంది పించన్‌దారులున్నారని బుధవారం బ్యాంక్ నుంచి నగదు డ్రా చేసుకున్నామని, గురువారం నుంచి పంపిణీ చేస్తామని ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా తెలిపారు. వయో వృద్ధులు, దివ్యాంగులు, మానసిక స్థితి సరిగాలేని వారికి ఇంటి వద్దకే వెళ్లి సచివాలయ సిబ్బందితో పంపిణీ చేయిస్తామని చెప్పారు.

ఏడి 'పింఛన్'

- సచివాలయాల వద్ద పింఛన్ల కోసం వృద్ధుల పడిగాపులు
- చంద్రబాబు నిర్వాకంపై మండిపాటు
- మళ్లీ పాత రోజులు వచ్చాయని ఆందోళన
- పేదలను ఇబ్బంది పెడితే బాగుపడరని శాపనార్థాలు

ఐదేళ్లుగా ఇంటి వద్దే అవ్వాతాతలు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు సంతోషంగా పింఛన్లు తీసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వలంటీర్లను దూరం పెట్టాలని టీడీపీ నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో వలంటీర్లకు బదులుగా సచివాలయ సిబ్బందితో పింఛన్లు పంపిణీ చేయించాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. బుధవారం ఉదయం నుంచే ఆయా గ్రామ సచివాలయాల వద్ద పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న వృద్ధులే కనిపించారు. చంద్రబాబు నిర్వాకంతో మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి దాపురించిందని పెన్షన్‌దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


పెద్దతుంబళంలో పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు

ఆదోని రూరల్: ఆదోని మండలంలో 35 సచివాలయాల్లో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి పింఛన్ల పంపిణీ మొదలయ్యింది. మొత్తం 11,898 మంది పింఛన్‌దారులు ఉన్నారు. ప్రతి నెలా వారికి వలంటీర్లు తెల్లవారుజామున 5 గంటల నుంచి 8 గంటల్లోపు పింఛన్లను అందించేవారు. వలంటీర్లు పింఛన్‌లు అందించరాదని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. దీంతో పింఛన్‌దారులు ఉదయం 9 గంటల కంతా ఆయా సచివాలయాలకు వ్యయ ప్రయాసాలతో వెళ్లి పడిగాపులు కాశారు. కూడు, నీరు లేక ఎండవేడిమిని తట్టుకోలేక అవస్థలు పడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఐదేళ్లుగా తెల్లవారుజామున 5 గంటల కల్లా వలంటీర్లు తలుపులు కొట్టి పింఛన్‌లు ఇచ్చేవారని, చంద్రబాబు కక్ష్య కట్టి వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా కుయుక్తులు పన్నారని పింఛన్‌దారులు శాపనార్థాలు పెట్టారు. కాగా మొదటి రోజు మండలంలో 60 శాతం మందికి పింఛన్లను అందజేసినట్లు అధికారులు తెలిపారు. మంచానికి పరిమితమై నడవలేని పరిస్థితిలో ఉన్న వారికి గురువారం సాయంత్రంలోపు సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి అందిస్తారని ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయశేఖర్‌రావు తెలిపారు.


పెద్దహరివాణంలో ఎండలో వేచి ఉన్న వృద్ధులు


పాండవగల్‌లో సాయంత్రం 4 గంటల సమయంలో పింఛన్ అందుకుంటున్న లబ్ధిదారులు

ఆదోని పట్టణంలో..

ఆదోని పట్టణంలో 17,399 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరిలో దివ్యాంగులు 2,209, వృద్ధులు 7,840, వితంతువులు 6,130, ఒంటరి మహిళలు 739 మంది, ట్రాన్స్‌జెండర్స్ 29 మంది ఉన్నారు. రూ.5,21,41,500 నగదును పంపిణీ చేయాల్సి ఉంది. మొత్తం పట్టణంలో 42 వార్డు సచివాలయాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభమయ్యింది. దాదాపు 70 శాతానికి పైగానే పింఛన్ల పంపిణీ పూర్తి అయినట్లు మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి తెలిపారు.

మా ఉసురు తగులుతుంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా సమస్యలను అర్థం చేసుకుని వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేసేవారు. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే అందించేవారు. అలాంటి వలంటీర్లపై కక్ష కట్టి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి ఇబ్బందులకు గురిచేశారు. మళ్లీ పాత రోజుల్లోలా పింఛన్ కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి కల్పించారు. మాలాంటి వాళ్ల ఉసురు వారికి కచ్చితంగా తగులుతుంది. వచ్చే ఎన్నికల్లో వారికి తగిన బుద్ధి చెబుతాం.

–ముల్లా ఉసేన్‌బీ, వృద్ధాప్య పింఛన్‌దారురాలు

60 శాతం పంపిణీ చేశాం

బుధవారం మధ్యాహ్నం నుంచి సచివాలయాల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శుల ద్వారా పింఛన్ల పంపిణీ మొదలుపెట్టాం. మొదటి రోజే 60 శాతం పూర్తి చేశాం. గురువారం సాయంత్రం లోపు వంద శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. మంచానికే పరిమితమైన పింఛన్‌దారులకు కూడా ఇంటి వద్దకు అధికారులు వచ్చి పింఛన్‌ను అందిస్తారు. ఎవరూ అధైర్యపడవద్దు.

– విజయశేఖర్, ఆదోని ఎంపీడీఓ

ఎత్తిపోయిన టీడీపీ ప్రచారం

- సొంత పార్టీ నాయకుల నుంచే చుక్కెదురు
- టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డికి చెమటలు

మంత్రాలయం: నియోజకవర్గంలో ఉనికి కోసం తెలుగుదేశం పార్టీ ఆపసోపాలు పడుతోంది. అభ్యర్థి ఎన్.రాఘవేంద్రరెడ్డి వైఎస్సార్‌సీపీ కంటే ముందుగానే ప్రచారానికి దిగారు. అయితే ఎక్కడా కూడా పార్టీకి ప్రజాస్పందన లేకపోయింది. ఎక్కడికక్కడే నిలదీతలు ఎదురయ్యాయి. బుధవారం రాఘవేంద్రరెడ్డి కౌతాళం మండల కేంద్రంలోని మాసాల గేరి, మారెమ్మ ఆలయ వీధుల్లో ప్రచారం చేపట్టారు. కొత్త ముఖం కావడంతో ప్రజలు ముఖం మీదనే తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. దీంతో ఆయన ప్రచారం తూతూమంత్రంగా సాగింది. అదే కాలనీవాసులు సమస్యలపై నిలదీశారు. హనుమాన్ నగర్‌లో ఓ మహిళ మా దేశాయ్ (వైఎస్సార్సీపీ) ధని ఎలా చెబితే అలా అనగానే అంతా నివ్వెరపోయారు.

మీకూ.. మాకు సంబంధం లేదు..

తారాపురంలో ప్రచారానికి వెళ్లిన రాఘవేంద్రరెడ్డి సోదరుడు ఎన్.రామకృష్ణారెడ్డికి సొంత పార్టీ గ్రామ నాయకుడు హరిచంద్ర నుంచి చేదు అనుభవం ఎదురైంది. తమతో కలిసి రావాలని గ్రామ నాయకుడిని కోరగా.. మాకూ మీకూ సంబంధం లేదని ముఖంపైనే చెప్పేశారు. ఎంతగా బతిమలాడినా ఆయన సమ్మతించలేదు. తామంతా పాలకుర్తి తిక్కారెడ్డి వర్గమని, ఏదైనా చేస్తే ఆయన కోసం కష్టపడతాం.. అంతేగానీ మీకు మద్దతుగా నిలిచేదిలేదంటూ తేల్చిచెప్పడంతో మారు మాట్లాడకుండా వెనుదిరిగారు. సొంత పార్టీ నుంచే మద్దతు లభించక నానా తంటాలు పడుతుండటం విశేషం.


కౌతాళంలో టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డిని నిలదీస్తున్న మహిళ

జగనన్న విజయాన్ని ఆపలేరు


ఐరన్‌గల్లులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కోసిగి: పేదలకు అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజయాన్ని ఎవరూ ఆపలేరని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని డి.బెళగల్, ఐరన్‌గల్లు గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లుగా రాష్ట్రంలో ప్రజల వద్దకే పరిపాలన అందించారన్నారు. గతంలో ప్రతి పనికి మండల కేంద్రానికి వెళ్లే వారన్నారు. పింఛన్ పంపిణీలో దేశంలోనే నూతన విధానానికి శ్రీకారం చుట్టి అభినందనలు పొందారన్నారు. ఇప్పటి లాగా సచివాలయాల వద్ద నిరీక్షించాల్సిన అవసరం లేకుండా తెల్లవారక ముందే వలంటీర్లు ఇంటికొచ్చి నగదు అందజేశారని చెప్పారు. మళ్లీ నాటి కష్టాలు కావాలో.. ఇంటి వద్దనే ఉండి అన్ని సేవలు పొందాలో తేల్చుకోవాలని సూచించారు. జగనన్నతోనే పథకాలు కొనసాగుతాయని, లేకపోతే ఇలాంటి కష్టాలను కొనితెచ్చుకున్నట్లేనన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, ఎంపీపీ ఈరన్న, శ్రీనివాస రెడ్డి, జగదీష్ స్వామి, బుళ్లి నరసింహులు, మల్లికార్జున గౌడ,దొడ్డి నరసన్న, నాడుగేని వీరారెడ్డి, ఈరన్న గౌడ, రవిగౌడ, ఉరుకుందప్ప, సర్పంచ్ రామాంజనేయులు పాల్గొన్నారు.

110 మందికి ఉద్యోగాలు

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బుధవారం ప్రాంగణ ఎంపికలు జరిగాయి. ఫాక్స్‌కాన్ మొబైల్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీ, సన్మిన టెక్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రాజెక్ట్ డైరెక్టర్ జాన్, హెచ్‌ఆర్ హనుమంతమ్మ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశారు. ప్లేస్‌మెంట్ అధికారి మాట్లాడుతూ.. ఎంపికైన విద్యార్థులకు రెండు నెలలు చెన్నైలో రూ.15000 స్టైఫండ్ ఇచ్చి వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం దేవనహళ్లిలో ఉపాధి కల్పిస్తామని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించనున్నట్లు చెప్పారు. కళాశాల నుంచి 110 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. కళాశాల కరస్పాండెంట్ దైవాదీనం రెడ్డి, ప్రిన్సిపాల్ మురళీమోహన్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో వాటర్ బెల్స్ అమలు చేయాలి

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వాటర్ బెల్స్ అమలు చేయాలని డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి అన్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ కోసం ముందు జాగ్రత చర్యలను చేపట్టినట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నట్లు చెప్పారు. నిర్ణీత సమయానికి తాగునీరు తీసుకునే విధంగా వాటర్ బెల్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. విద్యార్థులు నీరు తాగేందుకు వీలుగా రోజులో మూడుసార్లు వాటర్ బెల్ మోగించాలని సూచించారు. ఉదయం 8.45, 10.05 గంటలకు, తర్వాత 11.50 గంటలకు వాటర్ బెల్ మోగించి విద్యార్థులు నీరుతాగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తగిన నీరు తీసుకోకవడం వల్ల డీ-హైడ్రేషన్‌కు గురికాకుండా ఉంటారని తెలిపారు.

ప్రచారానికి అనుమతి తప్పనిసరి

- ఆదోని ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ


అధికారులకు సూచనలు చేస్తున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోని రూరల్: ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రచారానికి ముందస్తు అనుమతి తీసుకోవాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదోని నియోజకవర్గంలో రాజకీయ పార్టీలు ఎన్నికల మీటింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నా, ర్యాలీలు నిర్వహించాలన్నా ముందస్తు అనుమతి తీసుకోవాలని తెలిపారు. నియోజకవర్గంలో ప్రచారానికి నిర్వహించి వీడియో వెహికల్, హెలిప్యాడ్స్, ఎయిర్‌బెలూన్స్‌కు అనుమతి పొందాలన్నారు. లోకల్ మీటింగ్స్, ర్యాలీలు, ఇతర ప్రచారాలకు ఆర్‌ఓ ద్వారా అనుమతులు పొందవచ్చన్నారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటుహక్కు కోసం నమోదు చేసుకోవచ్చని తెలిపారు. నియోజకవర్గంలో ఎక్కడైనా ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ హసీనాసుల్తానా, డీఎస్పీ శివనారాయణస్వామి, ట్రినీ డీఎస్పీ ధీరజ్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఎంపీడీఓ విజయశేఖర్, ఎన్నికల డీటీ రామేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత


పట్టుకున్న మద్యాన్ని చూపుతున్న సెబ్ సీఐ

ఆదోని రూరల్: ఆదోని సెబ్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐలు విన్నీలత, కర్నూలు డీటీఎఫ్ సీఐ నరసింహనాయుడు తెలిపారు. బుధవారం బాపురం చెక్‌పోస్టు వద్ద మూడు మోటార్ సైకిళ్లపై కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. బదినేహాల్ గ్రామానికి చెందిన వినోద్‌కుమార్, నగేష్‌లను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి నుంచి 41 కర్ణాటక మద్యం బాక్సులను స్వాధీనం చేసుకున్నామని.. వాటి విలువ సుమారు రూ.1.60 లక్షలు ఉంటుందని చెప్పారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఎరిగేరికి చెందిన మరో నిందితుడు మోటార్ సైకిల్ వదిలేసి పరారయ్యాడని, త్వరలోనే పట్టుకుంటామన్నారు. కర్ణాటక మద్యం అక్రమ సరఫరాపై ఉక్కుపాదం మోపుతామన్నారు. దాడుల్లో బాపురం చెక్‌పోస్టు సీఐ చెన్నారెడ్డి, సెబ్ పోలీసులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ


పెద్దకడబూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఓ మురళీకృష్ణ

పెద్దకడబూరు : స్థానిక పోలింగ్ కేంద్రాలను ఆర్‌ఓ మురళీకృష్ణ బుధవారం తనిఖీ చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి కావాల్సిన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నియోజకవర్గం (పెద్దకడబూరు, కోసిగి, మంత్రాలయం, కౌతాళం మండలాలు)లో మొత్తం 237 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఓటర్లు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, విద్యుత్, ఫ్యాన్లు తదితర సౌకర్యాలు కల్పించామన్నారు. తహసీల్దారు సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.